క్లుప్తంగా

ఆలయాల్లో మాజీ ఎంపీ వివేక్ పూజలు



ఆలయంలో కొబ్బరికాయ కొడుతున్న వివేక్

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి, ధర్మారం గ్రామాల్లోని ఆలయాలను బుధవారం మాజీ ఎంపీ బీజేపీ నాయకుడు వివేక్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దొంగతుర్తిలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో పూజలు చేసిన వివేక్ అనంతరం ధర్మారంలో భక్త మార్కండేయ విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వివేక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు యాళ్ల తిరుపతిరెడ్డి, నాయకులు కాడే సూర్యనారాయణ, గుర్రం తిరుపతిగౌడ్, ద్యాగేటి ఉదయ్, ఎల్లాల మనోహర్‌రెడ్డి, పెరుమాండ్ల ప్రసాద్, బీమారపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

రామగిరి: మండలంలోని బుధవారంపేటలో సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం ఎంపీపీ అరెల్లి దేవక్క భూమిపూజ చేశారు. రూ. 21లక్షల ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణం నాణ్యతతో చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాదరవేణి శారద, సర్పంచ్ దేవునూరి రజిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేసి రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో ప్రతీ ఏటా ఉగాది ముందు అమావాస్య రోజు నిర్వహించే నూకాంబిక పోచమ్మ జాతర పోస్టర్‌ను బుధవారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతరకు రావాలని అదనపు కలెక్టర్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జెమ్ముల రామారావు,రవీందర్, శివ, సుబ్రహ్మణ్యం, సాదనాల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణం అడ్డగింత

జ్యోతినగర్: ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న కట్టడాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకుని పనులు నిలిపేశారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో చెరువు శిఖం భూమిలో అక్రమంగా ఓ నిర్మాణం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందుకున్న రామగుండం రెవెన్యూ అధికారులు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి పనులను నిలిపివేసినట్లు ఆర్ఐ భవాని ప్రసాద్ తెలిపారు. జీవో-59 ప్రకారం డిమాండ్ నోటీసులు అందించినప్పటికీ వారు సంబంధిత రుసుము చెల్లించలేదని తెలిపారు. నిర్మాణ ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు.

మహిళా హక్కులపై దాడులు

గోదావరిఖని: మహిళా హక్కులపై దాడులు కొనసాగుతున్నాయని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కుల, మత, వర్గ వివక్షను పెంచి పోషిస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు మంగ, డి.బుచ్చమ్మ, భాను, రజిత, మానస, బి.రజిత, స్వరూప పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే కాలనీలో విద్యుత్ సౌకర్యం

మంథని: పట్టణ పరిధిలోని పోచమ్మవాడలో నూతనంగా నిర్మించిన సావిత్రిబాయి పూలే కాలనీ(డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం)లో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.నూతనంగా ఏర్పాటు చేసిన రెండు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. ఇప్పటికే డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నూతనంగా విద్యుత్ మీటర్లను బిగించారు. విద్యుత్ సరఫరాతో కాలనీలో వెలుగులు విరజిమ్ముతున్నాయి.



కమాన్‌పూర్‌లో మహిళా ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న నాయకులు

మహిళా దినోత్సవ సంబురాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రం, మంథని, రామగుండం నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మహిళా అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పారిశుధ్య కార్మికులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను అధికారులు, నాయకులు సన్మానించారు. గోదావరిఖనిలో మహిళా ఫొటో గ్రాఫర్లను సన్మానించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. స్త్రీ లేనిదే సృష్టి లేదని, స్త్రీలను గౌరవించాలని పలువురు సూచించారు.

- సాక్షి, నెట్‌వర్క్



జూలపల్లిలో ఎంపీపీ, సర్పంచ్‌లకు సన్మానం



రైల్వే ఆర్‌వోహెచ్ షెడ్‌లో రైల్వే మహిళా ఉద్యోగుల సంబరాలు



రామగిరి: ఆటలు ఆడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందికి నాయకుల సన్మానం



ధర్మారం: సర్పంచ్, కార్మికులకు హెచ్‌ఎం సన్మానం



సుందిళ్లలో సర్పంచ్ లక్ష్మి, మహిళల సంబరాలు



మహిళలను సన్మానిస్తున్న సోమారపు



గోదావరిఖనిటౌన్: హెచ్‌ఎంను సన్మానిస్తున్న టీచర్లు



మహిళా ఫొటోగ్రాఫర్లను సన్మానించిన అసోసియేషన్ నాయకులు



జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కబడ్డీ ఆడుతున్న మహిళలు



జ్యోతినగర్: కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఆరోగ్య సంరక్షణపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- డయాగ్నోసిస్ గది ప్రారంభం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్ , మేయర్ అనిల్‌కుమార్

రామగుండం: అబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోగ్య మహిళ కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక డయాగ్నోసిస్ గదిని ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళల ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి నిర్ణయించడంతో మహిళలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. మహిళలు ఇంట్లో పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, కుటుంబ పరిరక్షణ తదితర చర్యలతో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారని, సాధారణ వ్యాధులుగా పట్టించుకోరన్నారు. ఇటీవల మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, ఒబెసిటీ, బీపీ, షుగర్ సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే రోగాల బారి నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కృపాబాయి, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, బద్రి రాజు పటేల్, వైద్య సిబ్బంది, మహిళలు హాజరయ్యారు.

ప్రతి మహిళా ఆర్థిక సాధికారత సాధించాలి

గోదావరిఖని: ప్రతి మహిళా ఆర్థిక సాధికారత సాధించి అన్ని రంగాల్లో ముందుండాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మార్కండేయకాలనీలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ ప్రతిభోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా సంక్షేమంలో రాష్ట్రం ముందంజలో నిలుస్తుందన్నారు. ఎంపీ సంతోష్‌రావు గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో మహిళలు క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళలకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరినదిలో ఉచిత బోటు ప్రయాణాన్ని కల్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, మూల విజయారెడ్డి, మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ట్రైనీ ఐఏఎస్‌ల స్వచ్ఛ భారత్

కాల్వశ్రీరాంపూర్:మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ట్రైనీ ఐఏఎస్‌లు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీధులను శుభ్రం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతలు, పెరటి తోటల పెంపకం, హరితహారం కార్యక్రమాలపై అవగాహన పెంచుకుంటున్నామని తెలిపారు. సర్పంచ్ బండ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచు చందు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో ఉపాధి కూలీలతో..

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో పర్యటిస్తున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఉపాధి హామీ పనులను సందర్శించారు. కూలీలతో మాట్లాడారు. రోజు కూలీ ఎంత అని, సకాలంలో డబ్బులు చెల్లిస్తున్నారా..? అని తెలుసుకున్నారు. అనంతరం రైతు వేదికలో వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి, రైతులతో సమావేశమయ్యారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉన్నారు.

పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట పంచాయతీ వద్ద మహిళలు వేసిన ముగ్గులను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకం, వండి వడ్డించే విధానాన్ని తెలుసుకున్నారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, సర్పంచ్ సంతోష్ రావు, ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, ఎంపీవో కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

సుల్తానాబాద్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి ముందు వరుసలో ఉండాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ లోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను కేవలం తరగతి గదికే పరిమితం చేయకుండా విశ్లేషణ చేసి సమాజంలో అమలుపరిచేటట్లుగా కృషిచేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, శ్యాంసుందర్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న పదో తరగతి విద్యార్థినులు

నేటి నుంచి రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీజేపీ సిద్ధాంతాలు తెలుసుకోవాలి

ఓదెల: నాయకులు బీజేపీ సిద్ధాంతాలను తెలుసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శనిగరపు రమేశ్ అన్నారు. బుధవారం పొత్కపల్లిలో మాట్లాడారు. బీజేపీలో ఉన్నతస్థాయి నాయకుల పర్యటన సందర్భంగా స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బుధవారం ఓదెల పర్యటనకు వచ్చిన మాజీ ఎంపీ వివేక్ స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గ్రూపు రాజకీయాలు పార్టీకి నష్టం కలిగిస్తాయన్నారు. సమావేశంలో బీజేవైఎం జిల్లాకార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు డబ్బులడిగితే చర్యలు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అంత్యక్రియలకు ఎవరైనా డబ్బులడిగితే చర్యలు తీసుకుంటామని నగరపాలిక కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. శ్మశానవాటిక, వైకుంఠ ధామం నిర్వహణకు ఏలాంటి రుసుము చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. దహన సంస్కారాలకు డబ్బులు డిమాండ్ చేస్తే, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

రెండు రోజులు భగీరథ తాగునీటి సరఫరా బంద్

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాలకు నేడు, రేపు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఉండదని భగీరథ ఈఈ కే.పూర్ణ చందర్ తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నిరుపేద యువతి పెళ్లికి సాయం

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన గుండు సత్యనారాయణ - దేవేంద్రల కూతురు సోనీ వివాహానికి జెడ్పీటీసీ, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ రూ.5 వేల ఆర్థిక సాయం పంపించగా, సంఘం అధ్యక్షుడు అందె రాజయ్య, నాయకులతో కలిసి బుధవారం వధువుకు అందజేశారు.

వైభవంగా శ్రీ కృష్ణారుక్మిణీ కల్యాణం



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని కృష్ణాలయంలో బుధవారం శ్రీ కృష్ణారుక్మిణీ కల్యాణంను యాదవ కులస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం పాల పొరక, ఎదుర్కోల్లు, మహిళలు కుంకుమ పూజలు, కల్యాణం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. అర్చకులు వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. భక్తులు స్వామివారికి ఒడి బియ్యం, కట్నకానుకలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచు ఆడెపు శ్రీదేవి, ఎంపీటీసీ మాదాసు సువర్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, చిన్నబొంకూర్ గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల చొప్పున రెండు గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చిన్నబోంకూర్‌లో ఈ-పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులున్నారు.

భవన నిర్మాణ కార్మికులు సంఘటితం కావాలి



కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

ఎలిగేడు: భవన నిర్మాణ కార్మికులు సంఘటితమై తమ హక్కులు సాధించుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలో సర్పంచ్ భూర్ల సింధూజతో కలిసి భవన నిర్మాణ కార్మికుల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ, మండల కమిటీలతోనే సంఘం బలోపేతమవుతుందని, కార్మికులు ఆ దిశగా కృషి చేయాలని కోరారు. సర్పంచ్ సింధూజ మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సహకరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శ్రమ్ కార్డు, లేబర్ కార్డును తీసుకుని సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు గూడెల్లి ఏసుదాసు, జిల్లా కార్యవర్గసభ్యులు కాంపెల్లి శంకర్, దుర్గం శంకరయ్య, నాయకులు కవ్వంపల్లి శంకరయ్య, తీట్ల శ్రీనివాస్, శివపల్లి శ్రీహరి, జాతరగొండ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న రవీందర్

రామగిరి: మండల ఎంపీపీ అరెల్లి దేవక్క, ఆమె భర్త కొంరయ్యను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్ కోరారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి మాట్లాడారు. ఎంపీపీ, ఆమె భర్త ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ పార్టీని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, దీనిలో భాగంగానే ఈ నెల 4 న జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధుపై నిరాధారమైన అసత్య, నిందారోపణలు చేస్తూ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారని వివరించారు. పార్టీలోనే ఉంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతిష్ఠను, అటు బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు లబ్ధి చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. వారిని పిలిపించి విచారించి వారి వద్ద ఏం ఆధారాలున్నాయో తెలుసుకోవాలని కోరారు. సొంత పార్టీలో ఉంటూ పక్క పార్టీ నాయకులకు సహకరిస్తూ పార్టీకి ద్రోహం చేయడానికి కుట్ర పన్నుతున్న దేవక్క, కొంరయ్యను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఆయన వెంట ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దామెర శ్రీనివాస్ ఉన్నారు.